క్లుప్తంగా

40 శాతం రాయితీపై గడ్డికోత యంత్రాలు

మాడుగుల: 40 శాతం రాయితీపై గడ్డి కోత యంత్రాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని స్థానిక పశువైద్య శాఖ సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు బుధవారం తెలిపారు. మాడుగుల, చీడికాడ మండలాల్లో ఇంత వరకు 20 దరఖాస్తులు అందాయన్నారు. ఆసక్తి గల రైతులు సమీప రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. యూనిట్ రూ. 33,970 కాగా, సబ్సిడీ రూ.13,588 పోను రైతు వాటాగా రూ.20,382 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎం.కోడూరు, కేజేపురం పశువైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎ. కొత్తపల్లిలో ఎరువుల పంపిణీ



యూరియా బస్తాలను రైతులకు అందజేస్తున్న వైస్ ఎంపీపీ బుల్లిలక్ష్మి

దేవరాపల్లి: సకాలంలో విత్తనాలు, ఎరువులు అందజేస్తున్న సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని వైస్ ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి తెలిపారు. బుధవారం ఎ. కొత్తపల్లి రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ చింతల సత్యవెంకటరమణతో కలిసి ఆమె రాయితీపై యూరియా బస్తాలను రైతులకు పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో మాదిరిగా విత్తనాలు, యూరియా కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షణ చేసే పని లేకుండా సొంత గ్రామాల్లోనే అందజేస్తున్నామన్నారు. ఆర్బీకేల ద్వారా అన్ని సేవలు అందిస్తుండటంతో అన్నదాతలు మండల కేంద్రానికి వెళ్లే కష్టాలు తప్పాయన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే ఇన్‌చార్జి దివ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కల్వర్టు వెంటనే ఏర్పాటు చేస్తాం



శిథిలమైన కల్వర్టును పరిశీలిస్తున్న జెడ్పీటీసీ గిరిబాబు

గొలుగొండ: మండలంలోని వెంకటాపురం, పీఎన్‌డీపాలెం వెళ్లే మార్గంలో ఇటీవల పూర్తిగా శిథిలమైన కల్వర్టును వెంటనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు తెలిపారు. వారం రోజుల క్రితం ఇక్కడ కల్వర్టు శిథిలమవడంతో పీఎన్‌డీపాలెం ప్రజలు రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో కల్వర్టు వేస్తామన్నారు. కార్యక్రమంలో పుత్త డిగ్గైరంపేట సర్పంచ్ పత్తి రమణ, స్థానికులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాల పరిశీలన



సంపద కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో మీనాకుమారి

మాడుగుల రూరల్: ఎం. కోటపాడు, ఎం.కె. వల్లాపురం గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను బుధవారం ఎంపీడీవో మీనాకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా తడిపొడి చెత్తలు వేర్వేరుగా నిల్వ ఉంచి తద్వారా వచ్చే ఎరువులు రైతులకు తక్కువ ధరకు విక్రయించాలన్నారు. కేంద్రాల చుట్టూ మొక్కలు పెంచాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు శేనాపతి గంగాధర్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

160 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి లీలాప్రసాదు

మాడుగుల రూరల్: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా కె.జె.పురంలో బుధవారం 160 మంది రోగులను వైద్యాధికారి కె. లీలాప్రసాదు పరీక్షించారు. కళ్ల కలక, థైరాయిడ్, విష జ్వరాలుతో బాధపడుతున్న వారిని పరీక్షించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలందించారు. అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేశారు. హెచ్‌వీ పుష్పకాంతం, ఆరోగ్య సహాయకుడు పి. శంకర్, ఏఎన్ఎం అచ్యుతాంబ పాల్గొన్నారు.

తెరిపివ్వని వర్షం



వర్షాలకు పొంగి ప్రవహిస్తున్న తాచేరు నది

- బుచ్చెయ్యపేటలో 56 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- స్తంభించిన జనజీవనం

బుచ్చెయ్యపేట: మండలంలో వర్షం తెరిపివ్వడం లేదు. రెండు రోజులుగా ఉదయం వరకు ఎండ కాస్తూ మధ్యాహ్నం నుంచి వర్షం దంచి కురుస్తోంది. ఈ వర్షంలో రాకపోకలకు పలువురు ఇబ్బందులు పడ్డారు. అసంఘటిత కార్మికులు వర్షంలో తడిచి ముద్దయ్యారు. బుధవారం మండలంలో 56 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. దీంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయింది. పల్లపు ప్రాంతాలతోపాటు మెరక ప్రాంత పొలాల్లో నీరు చేరింది. పెద్దేరు, బొడ్డేరు, తాచేరు నదులతోపాటు గుర్రపుగెడ్డ నదులు వర్షం నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాల్లో మట్టి రోడ్లు, గ్రావెల్ రోడ్లు వాహనాల రాకపోకలతో బురద మయంగా మారాయి. వరి నాట్లు వేసే పొలాల్లో నీరు చేరడంతో రైతులు జోరుగా దమ్ములు చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టారు.

పొంగి ప్రవహిస్తున్న నదులు, గెడ్డలు

మాకవరపాలెం: తుపాను వర్షాలతో నగదులు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొండలఅగ్రహారం వద్ద సర్పానదితోపాటు గిడుతూరు నుంచి ప్రవహించే వరాహనదిలో పుష్కలంగా నీరు చేరి ప్రవహిస్తున్నాయి. చెరువులు, గెడ్డలు సైతం నీటితో కళకళలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఖరీఫ్‌లో చేపట్టనున్న సాగుకు ఈ వర్షాలు ఎంతో మేలు చేశాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దమ్ములకు మేలు చేసిన వర్షం

గొలుగొండ: దారకొండపై కురుస్తున్న భారీ వర్షాలకు దారగెడ్డ, బోరింగ్‌గెడ్డ, బొడ్డేరు గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ వర్షం నీరు తాండవ జలాశయంలో భారీగా చేరుతోంది. ప్రస్తుతం తాండవ జలాశయం నీటి మట్టం పెరుగుతోంది. దారగెడ్డ ఆయకట్టు రైతులు నాట్లు వేసేందుకు రెండు రోజుల నుంచి దమ్ములు పట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. మరో పది రోజుల్లో మండలంలో నాలుగు వేల ఎకరాల్లో నాట్లు పూర్తవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.



గొలుగొండ: దారగెడ్డ నుంచి తాండవ జలాశయంలో చేరుతున్న వర్షం నీరు



మాకవరపాలెం: సర్పానదిలో వరదనీటి పరవళ్లు



చోడవరంలో రోడ్లపై నిలిచిపోయిన వర్షం నీరు



బుచ్చెయ్యపేటలో ఉధృతంగా ప్రవహిస్తున్న గుర్రపు గెడ్డ

ఈదురుగాలులతో భయాందోళన

చోడవరం: తుపాను వర్షాలతో జన జీవనం స్తంభించింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తుండటంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. మరో పక్క భారీ ఈదురుగాలులకు భయభ్రాంతులకు గురయ్యారు. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. చోడవరం పరిసరాల్లో మూడు రోజుల్లో 30 మిల్లీమీటర్లు వర్షం కురవగా బుధవారం ఒక్కరోజే 25 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఉదయం, రాత్రి తేడా లేకుండా వర్షం ఏకధాటిగా ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో జనజీవనం స్తంభించిపోయింది. పొలాల్లో భారీగా వర్షపు నీరు చేరింది. రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు చాలా ఇబ్బందులు పడ్డారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మాడుగుల రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి బుధవారం వాయుగుండంగా మారడంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మధ్యాహ్నం మోస్తరుగా కురుస్తున్న వర్షాలతో పల్లపు భూముల్లో వేసిన వరి నారుమడులు ముంపునకు గురయ్యాయి. తాచేరు, శారదా నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షాలతో ఖరీఫ్ వరినాట్లు వేయడానికి రైతులు సమాయత్తం అయ్యారు. దమ్ములు దున్నుతున్నారు. మండలంలో పాలగెడ్డ, ఉరకగెడ్డ, చింతగెడ్డలో నీరు పొంగి ప్రవహిస్తోంది.

ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం మాది

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



ఎల్.బి.పట్నంలో వృద్ధుడితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం మనదని, అందుకే కులం, మతం, పార్టీ, ప్రాంతం, వర్గం అనే తేడా లేకుండా మన జగనన్న సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. బుధవారం ఎల్.బి.పట్నం పంచాయతీలో ఆ గ్రామంతోపాటు కె.ఎల్.బి.పట్నంలో గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్‌తో ప్రతి కుటుంబాన్ని కలిశారు. సంక్షేమ పథకాల అందుతున్న తీరుపై ఆరా తీశారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు చిరునవ్వుతో ఆహ్వానించి ఆనందం పంచుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు రామాలయ నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.20లక్షలు, ఎంపీ నిధుల నుంచి రూ. 5 లక్షలు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణాలకు రూ.20 లక్షలు మంజూరు చేశామన్నారు. విద్యుత్ స్తంభాల మార్పునకు అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఎంపీపీ పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. గర్భిణుల సీమంతాల్లో పాల్గొని దీవించారు. పిల్లలకు అన్నప్రాసన చేశారు. పలు సమస్యలను తక్షణమే పరిష్కరించారు. స్థలం ఉన్నవారు ఇల్లు నిర్మించుకుంటామంటే మంజూరు చేయాలని ఆదేశించారు. పంచాయతీలో రూ.87.20 లక్షలతో ఇంటింటా కుళాయిల ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎంపీపీ కురచా జయమ్మ, తహసీల్దార్ బి.వి.రాణి, ఎంపీడీవో జయప్రకాష్, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, సర్పంచ్ బండారు వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, నేతలు ఒబ్బలరెడ్డి వరహామూర్తి, తీట నూకరాజు, చుక్కా అప్పలనాయుడు, మోసూరి సన్నిబాబు, సుంకర శ్రీను, షేకు సూర్యనారాయణ, కురచా నారాయణమూర్తి పాల్గొన్నారు.

అర్జునగిరిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొంటారని, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

రెగ్యులరైజేషన్ చేయాలని కాంట్రాక్ట్ ఉద్యోగులు వినతి



చంద్రశేఖర్‌రెడ్డికి వినతి ఇస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

రోలుగుంట: రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ వివిధ జిల్లాలకు చెందిన 13వ ఫైనాన్స్ కమిషన్ కాంట్రాక్ట్ ఉద్యోగులంతా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు ఆధ్వర్యంలో అమరావతిలో ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, సర్వీసుల సలహాదారు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. 2016 మే 27న విడుదల చేసిన జీవో నంబరు 90 ప్రకారం స్టాఫ్‌నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ పోస్టుల్లో నియమితులైన తమను రెగ్యులరైజేషన్ చేసి ఆదుకోవాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులు నాగరాణి, నాగమణి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

- అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో

నాతవరం: వర్షాకాలంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం ఉంటామని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. ఆయన బుధవారం ములగపూడి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొంతసేపు చిన్నారులతో ముచ్చటించారు. కేంద్రం నిర్వహణ, స్టాకు రిజిస్టరు పరిశీలించారు. వర్షాకాలంలో చిన్నారులు విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. మెనూ విధిగా అమలు చేసి ఆటపాటలు నేర్పించాలన్నారు. తర్వాత ఎలిమెంటరీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందించిన విద్యా కానుక కిట్లను, విద్యా బోధన, మధ్యాహ్న భోజనం అమలుతీరు పరిశీలించారు.



అంగన్‌వాడీ చిన్నారులతో ముచ్చటిస్తున్న ఎంపీడీవో హనుమంతరావు, ఎంపీపీ లక్ష్మణమూర్తి

పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలని హెచ్ఎం కూండ్రపు సత్యనారాయణకు సూచించారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి సర్పంచ్ మార్తి నాగమణి, ఎంపీటీసీ తమరాన లోవకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

ఎ.కొత్తపల్లి హైస్కూల్‌కు వంట సామగ్రి వితరణ

దేవరాపల్లి: ఏ.కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.36 వేలు విలువ చేసే వంటపాత్రలు, మ్యాటీ లు, నోటీస్ బోర్డును సాయి సేవా సమితి ట్రస్టీ శశిభూషణరావు వితరణ చేశారు. ఈ మేరకు హెచ్ఎం వై. స్వర్ణలతకు బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి బాబా చూపిన సేవా మార్గంలో నడుస్తూ గ్రామీణ విద్యార్థులను విద్యాపరంగా ప్రోత్సహించడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. సాయి సేవా సమితి అనకాపల్లి సమన్వయకర్త అప్పారావు మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను గుర్తించి వాటిని సమకూర్చి వారి ఉజ్వల భవిష్యత్‌కు చేయూతనివ్వడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. ట్రస్టీ శశిభూషణరావు, సావిత్రి, అప్పారావులకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు.



వితరణ సామగ్రితో హెచ్ఎం స్వర్ణలత

తగు జాగ్రత్తలతో కళ్ల కలక దూరం



సిబ్బందితో సమావేశమైన వైద్యులు ధనలక్ష్మి, వెంకట శ్రావణి

రోలుగుంట: కళ్ల కలక లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి స్థానిక పీహెచ్‌సీలో వైద్యులు కె.ధనలక్ష్మి, కె.వెంకట శ్రావణి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుసుస్సు ఎర్రగా మారడం, కంటి నుంచి నీరు కారడం, నిద్రపోయినప్పుడు కనురెప్పలు అంటుకోవడం కళ్ల కలక లక్షణాలు అన్నారు. ఇంట్లో ఒకరికి వస్తే కుటుంబంలో అందరికీ సంక్రమిస్తుందన్నారు. కళ్ల కలక సోకితే ఇతరులకు దూరంగా ఉండాలన్నారు. ప్రత్యేకంగా వస్తువులు వాడాలన్నారు. తరుచూ కళ్లు, చేతులు నీటితో శుభ్రం చేసుకోవాలన్నారు. కళ్లద్దాలు విధిగా వాడడం మంచిదన్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

పలు శాఖల సమస్యలపై సభ్యుల నిలదీత



హౌసింగ్ ఏఈని సమస్యలపై ప్రశ్నిస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు: ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అధ్యక్షతన బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల సమస్యలపై సంబంధిత అధికారులను సభ్యులు నిలదీశారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు అందడం లేదని ఏవో సోమశేఖర్‌ను వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ ప్రశ్నించారు. కనీసం ఆర్బీకేల పరిధిలో వ్యవసాయ శాఖ సహాయకుల విధి నిర్వహణలో వేళాపాళా ఉండటం లేదన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి సకాలంలో బిల్లులను మంజూరు చేయడంలో మండల స్థాయి గృహ నిర్మాణ శాఖ సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు కొరువాడ ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు పేర్కొన్నారు. బిల్లుల కోసం అడిగితే ఎల్పీసీలు రాలేదని నిర్మాణదారులకు చెబుతుండడం వల్ల స్థానిక ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. మండలంలో ఇంకా వెయ్యి మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలను ప్రారంభించలేదని ఏఈ బి.రవిబాబు తెలిపారు. వారికి అవగాహన కల్పించి నిర్మాణాలను ప్రారంభించే బాధ్యత హౌసింగ్ అధికారులపై ఉందని ఎంపీపీ తెలిపారు. గృహ నిర్మాణ శాఖ ప్రగతిపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. 3,946 పండ్ల మొక్కలను గ్రామా లకు పంపించామని, డ్వాక్రా సంఘంలో ముగ్గురికి నిర్ణయించిన ధరకే వీటిని ఇవ్వాలని ఏపీఎం చంద్రకళ తెలిపారు. నిర్ణయించిన ధర కంటే ఎక్కువగా వీవోఏలు అమ్మకాలు సాగించినట్లు చౌడువాడ, సూదివలస ఎంపీటీసీలు వర్రి రామునాయుడు, ఏటుకూరి రాజేష్, రొంగలి సూర్యనారాయణ నిలదీశారు. చౌడువాడలో విద్యుత్ కోతలు అధికంగా ఉంటున్నాయని, ఈ సమస్యను పూర్తిగా తగ్గించేలా చర్యలను తీసుకోవాలని ఎలక్ట్రికల్ అధికారులను ఎంపీటీసీ రాజేష్ కోరారు. మండలంలో జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను మంజూరు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు తహసీల్దార్ జె.రమేష్ బాబుకు ఎంపీటీసీ, సర్పంచ్‌లు అభినందనలు తెలిపారు. జలజీవన్ మిషన్ నుంచి రూ.27 కోట్లతో మండలంలో 102 పనులు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అల్లు శ్వేత తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 3,146 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించామని ఎంఈవో - 1, 2 సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శచీదేవి, ఎంపీటీసీ లెక్కల గౌతమి, నెక్కల గోపి, వంటాకు నారాయణమ్మ, గొర్రుపోటు రామలక్ష్మి, రొంగలి లక్ష్మి, సర్పంచ్‌లు వేచలపు దొరబాబు, వంటాకు అప్పాజీ, బండారు కనక మల్లీశ్వరి, రొంగలి రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఓటుకు ఇంటి నంబరు నమోదు

తహసీల్దార్ రమేష్‌బాబు



మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌బాబు

కె.కోటపాడు: ఇంటింటా ఓటర్ల సర్వేను బూత్ లెవెల్ అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ జె.రమేష్‌బాబు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సాయంత్రం బీఎల్వోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 21వ తేదీలోగా మండలంలోని 62 పోలింగ్ బూత్‌ల పరిధిలో 48,538 ఓటర్ల వివరాలను ఇంటింటా సర్వేలో పరిశీలించాలని సూచించారు. ఈ సర్వే ద్వారా ప్రతీ ఓటుకు వారి ఇంటి నంబర్‌ను నమోదు చేయాలని సూచించారు. పది ఓట్లు కన్నా ఎక్కువగా ఆ కుటుంబంలో ఉండే రెండో ఇంటి నంబర్ నమోదు చేయాలన్నారు. డిసెంబర్ 31వ తేదీకి 18 ఏళ్లు పూర్తి చేసుకున్న వారి నుంచి ఓటుహక్కు నమోదుకు దరఖాస్తు స్వీకరించాలని తెలిపారు. అదే విధంగా ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలు, మరణించిన, పెళ్లయి ఇతర గ్రామాలకు వెళ్లిన వారి కుటుంబ సభ్యులకు నోటీసులు ఇచ్చి ఓట్లను తొలగించాలని వివరించారు. సమావేశంలో ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ జె.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.



ఎం.అలమండలో ఇంటింటా ఓటరు సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మి

పక్కాగా ఓటరు సర్వే

దేవరాపల్లి: బీఎల్వోలు ప్రతీ ఇంటికి వెళ్లి పక్కాగా సర్వే చేయాలని తహసీల్దార్ ఎం. లక్ష్మి సూచించారు. ఎం. అలమండలో పోలింగ్ కేంద్రం 167లో ఇంటింటా ఓటరు సర్వేను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీఎల్వోలు తమకు నిర్దేశించిన ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు జాబితాలో తప్పొప్పులను సరి చేయాలన్నారు. ఇంటింటా సర్వేలో గుర్తించిన అంశాలను ఎన్నికల కమిషన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సర్వే పట్ల బీఎల్వోలు నిర్లక్ష్యం వహించకుండా వేగవంతం పూర్తి చేయాలని సూచించారు. ఎంపీటీసీ పోతల వెంకటరావు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించే ఉద్యోగులకు గుర్తింపు



ప్రసాదరావును సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

మాడుగుల రూరల్: ఉత్తమ సేవలందించే ఉద్యోగులకు సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని కింతలి పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి కె. మాలంనాయుడు తెలిపారు. ఇక్కడ పీహెచ్‌సీలో ఆరోగ్య పర్యవేక్షకుడిగా పనిచేస్తూ గాజువాక మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజరుగా పదోన్నతిపై వెళ్లిన జి.ప్రసాదరావుకు బుధవారం సాయంత్రం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. నాలుగేళ్లుగా ఆయన అందించిన సేవలను ప్రశంసించారు. వైద్యాధికారి నాగదివ్య, కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.లీలాప్రసాదు, ఎల్. శివప్రసాదుపాత్రుడు, వైద్యాధికారి బి.రవితేజ, సిబ్బంది ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కె.జె.పురం, కింతలి పీహెచ్‌సీల ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కారానికే జగనన్న సురక్ష

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



చోడవరం-1 సచివాలయంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



జేడీపేటలో మాట్లాడుతున్న తహసీల్దార్ పీవీరత్నం



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధికారులు

చోడవరం: ప్రజా సమస్యలు పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం-1, జుత్తాడ గ్రామ సచివాలయాల్లో బుధవారం జగనన్న సురక్ష గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. జుత్తాడలో 788 మంది, చోడవరం-1లో 680 అర్జీలను పరిష్కరించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలన్న ఆశయంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నామన్నారు. గతంలో ఎటువంటి సర్టిఫికెట్లు కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరిగి ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు అవేవి లేకుండా నేరుగా జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల వద్దకు వచ్చి పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజలు కష్టాలు తెలిసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలంతా పూర్తిస్థాయిలో మద్దతు పలకాలని కోరారు. ప్రత్యేకాధికారి రాజేశ్వరి, ఎంపీపీ గాడి కాసు, చోడవరం ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా నర్సింగరావు, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో చైతన్య, మండల పరిషత్ సూపరింటెండెంట్ అమ్మాజీ, వైస్ ఎంపీపీలు బైన కుమారిఈశ్వరరావు, బుద్ద గంగరాజు, చోడవరం సర్పంచ్ బండి నూకాలమ్మ, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, జుత్తాడ సర్పంచ్ దొడ్డి ప్రసాద్, కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు మళ్ల త్రినాథ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు డి. వెంకట్రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, ఏసీఎస్ కన్వీనర్ పతివాడ అప్పారావు, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, డీఆర్‌యూసీ మెంబరు బొడ్డు శ్రీరామ్మూర్తి, పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మాడుగులలో ముగిసిన జగనన్న సురక్ష

మాడుగుల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలి. పేదల బతుకుల్లో నవరత్నాల వెలుగులు నింపాలి. ఇదే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల ఒకటో తేదీన ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారంతో విజయవంతంగా ముగిసింది. ప్రజలకు అవసరమైన పత్రాలు జాప్యం లేకుండా వలంటీర్లు ద్వారా సర్వే చేయించి యుద్ధ ప్రాతిపదికన ప్రతి సచివాలయంలో 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. మండలంలో రెండు బృందాలుగా జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించాయి. 23 గ్రామ సచివాలయ పరిధిలో 15,800 సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వీటిలో తహసీల్దార్ పీవీ రత్నం బృందం 8,006, ఎంపీడీవో మీనాకుమారి బృందం 7,794 ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వివిధ సాంకేతిక కారణాల వల్ల ఆగిపోయిన పథకాలు సురక్ష ద్వారా అందాయని మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జేడీపేటలో..

జేడీపేటలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1,502 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి, తహసీల్దార్ పీవీరత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు పర్రే రామునాయుడు, వీఆర్వో రాము, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేలాది మందికి ఉచితంగా సేవలు

నాతవరం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వేలాది మందికి ఉచితంగా సేవలు అందించారని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. బుధవారం ఎం.బెన్నవరం సచివాలయంలో జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జీవిత చరిత్రలో ఇలాంటి సేవలు ఎప్పుడూ చూడలేదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనతోనే గ్రామంలోనే అవసరమైన సేవలు అధికారులు అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు ఆమోదంతోనే ప్రభుత్వ సేవలు అందేవన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హతే ప్రామాణికంగా ప్రజల ఇంటికే వస్తున్నాయన్నారు. నాతవరం మండలంలో ఈ రోజుతో సురక్ష సభలు విజయవంతంగా ముగిశాయన్నారు. అనంతరం ఉచితంగా సర్టిఫికెట్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీడీవో హనుమంతరావు, సర్పంచ్ మార్తి నాగమణి, ఎంపీటీసీ తమరాన లోవకృష్ణ మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ విద్యా విభాగం మండలాధ్యక్షుడు ఇట్టంశెట్టి గోవిందరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు తమరాన రాము, కార్యదర్శి గొడిటి సాయిబాబు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, పంచాయతీ కార్యదర్శు లు చినబాబు శ్రీను పాల్గొన్నారు.